

రవికుమార్‌కు సైకత స్వాగతం



శుభాకాంక్షలు తెలుపుతూ సైకత శిల్పం

నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారి జిల్లాకు విచ్చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్ గౌరవార్థం పట్టణంలోని కృష్ణాపురం కూడలి వద్ద గాజులకొల్లివలస గ్రామానికి చెందిన గేదెల హరికృష్ణ రూపొందించిన సైకత స్వాగత శిల్పం పలువురుని ఆకట్టుకుంది. ఇసుకతో సైకత శిల్పి టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే రవికుమార్ ముఖబింబ రూపాలను రూపొందించారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస



ఉద్దానం మునగకు భలే గిరాకీ

ఉద్దాన ప్రాంతంలో పండించే మునగ పంటకు భలే గిరాకీ ఉంది. పదునైన నేలల్లో సాగు చేస్తున్న మునగ పంటకు ఇతర రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలకు ఎగుమతులు అవుతున్నాయి. ఏడాదిలో మూడు పర్యాయాలు దిగుబడి వస్తుంది. ధర కూడా అమాంతంగా పెరుగుతూ ఉంటుంది. మునగకాయ తినడం వల్ల సుమారు 350 రకాల వ్యాధులకు ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

- **విరగకాసిన పంట**
- **ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు**
- **పెరటి నుంచి వాణిజ్య పంటగా...**

ప్రజాశక్తి- పలాస

పలాస, ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, వజ్రపుకొత్తూరు, మందస మండలాలతోపాటు గిరిజన ప్రాంతాల్లో సుమారు ఐదు వేలు ఎకరాల్లో మునగ సాగు చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. ఉద్దాన ప్రాంతంలో జీడి, కొబ్బరి పంటల్లో అంతర పంటగా మునగ పంట సాగు చేస్తుంటారు. ఏడాదిలో మూడు పర్యాయాలు దిగుబడి వస్తుందని, ప్రతి రెండు నెలలకొకసారి దిగుబడి రాక మరో రెండు నెలల పాటు ఖాళీగా చెట్లు ఉంటాయని రైతులు చెబుతున్నారు.

కేజీ రూ. 35లు

మునగ పంట దిగుబడి ప్రారంభంలో కేజీ రూ.15 ఉండేది. ప్రస్తుతం రూ.35 వరకు ధర పెరిగింది. గతంలో కన్న ఈ పర్యాయం దిగుబడి పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉద్దాన ప్రాంతంలో సాగు చేసే మునగ పంటకు ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. రుచితో పాటు మునక్కాయలు ఎక్కువగా నిలువ ఉంటాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధర రూ.వంద వరకు కేజీ పెరుగు అవకాశాలు ఉన్నాయని అటు హైతొంలం, ఉద్యాన శాఖ అధికారులు చెప్పడం విశేషం.

వాతావరణం: 20-25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతాలు అనుకూలం. 40 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణో గ్రతలో పూత రాలిపోతుంది. మంచును, అధిక చలిని తట్టుకోలేదు.

నేలలు: అన్ని రకాల నేలలు అనుకూలం. అధిక సేంద్రీయ పదార్థాలతో కూడిన ఇసుక నేలలు శ్రేష్టం. నేల ఉదజని సూచిక 6.0-7.5 మధ్యన ఉంటే మంచిది. నెలలో గింజలను పాలిథీన్ సంచుల్లోగానీ, నేరుగా పొలంలో గానీ విత్తుకోవాలి.

విత్తేసమయం: వార్షిక మునగ ఎప్పుడు నాటినా, వేసవి ప్రారంభంలోనే పూతకు వస్తుంది. జూన్ రెండో వారం ఆగస్టు చివరి వరకు భూమిలో నాటుకోవచ్చు. దేశవాళీ రకాలు ఎక్కువగా సాగులో ఉన్నాయి. మొక్క 4-6 మీ. ఎత్తు వరకు పెరిగి విత్తిన 160-170 రోజుల్లో పూతకు వస్తుంది. కాయ పొడవు 65-70 సెం.మీ. కాయబరువు 150 గ్రాములు.

దిగుబడి: మొక్కకు 33 కిలోలు, 200-225 కాయలు. జాఫ్నా: బహువార్షిక రకం. కాయ పొడవు 60-90 సెం.మీ. మెత్తని గుజ్జు, రుచికరంగా ఉంటుంది. రెండో సంవత్సరం నుంచి కాపుకు వస్తుంది. మొదటి రెండు సంవత్సరాలు ఏడాదికి చెట్టుకు 80-90 కాయలను, నాలుగో సంవత్సరం నుంచి చెట్టుకు 500-600 కాయలను పొందవచ్చు.

నేలతయారీ: నేలను 4-5 సార్లు దుక్కి వచ్చే వరకు దున్నాలి. బహువార్షిక రకాలకు 5ఇంటు5 మీ. దూరం, ఏకవార్షిక రకాలయితే 2.5, 2.5 మీ. దూరం ఉండాలి. గుంటల పరిమాణం 45ఇంటు45ఇంటు45 సెం.మీ. ఉండాలి,

ఎరువులు: గింజలు విత్తిన 3 నెలలకు ఒక్కొక్క గుంటకు వంద గ్రాముల యూరియా, 50 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి నీటిని ఇవ్వాలి. మొక్కలకు ఆరు నెలలకు ఒకసారి, 9 నెలలకు మళ్లీ ఒకసారి వంద గ్రాముల యూరియా, 50 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసి నీరు పెట్టాలి.

నీటి యాజమాన్యం: విత్తనాలు మొలకెత్తే వరకు ప్రతి 3 రోజులకు నీటితడి ఇవ్వాలి. తర్వాత 10-15 రోజులకు ఒకసారి నీటితడి ఇవ్వాలి. వరుసల మధ్య అంతర పంటలుగా అలసంద, బెండ, వంగ, ఫ్రెంచి చిక్కుడు వంటి పంటలను వేసుకోవచ్చు.

సస్యరక్షణ: చిన్న గొంగళి పురుగులు గుంపులు గుంపులుగా కాండంపై చేరి పత్రహరితాన్ని గీకి తింటాయి. పెద్ద పురుగులు ఆకులన్నీ తిని ఈ నెలను మిగులుస్తాయి.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి



ఎగుమతికి సిద్ధంగా ఉన్న మునగ బస్తాలు

జిల్లాలో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని మండలాల్లో ఎక్కువగా మునగ పంట సాగు చేస్తుంటారు. పదునైన నేలల్లో మునగ పంట సాగు చేయడం ద్వారా హైబ్రిడ్ మునక్కాయ కన్నా ఉద్దాన ప్రాంత మునక్కాయ ఎంతో రుచిగా ఉంటుంది. ఈ ప్రాంతంలో పండించమునక్కాయలను పలాస-కాశీబుగ్గ పట్టణాల్లో ఉన్న వ్యాపారులు కొనుగోలు చేసి ఒడిశా రాష్ట్రాలైన కటక్, భువనేశ్వర్, పశ్చిమ బెంగాల్, చెన్నయ్, హైదరాబాద్, విశాఖపట్నం, రాయపూర్, భిలాయ్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఒక్కరోజులో సుమారు 15 నుంచి 20 టన్నుల వరకు ఎగుమతి చేస్తుంటారు. ఒక సీజన్లో సుమారు 1200 టన్నుల వరకు మునక్కాయలను ఎగుమతి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పించాలి



మునగ చెట్లు తేలికపాటి గాలులకు, వర్షాలకు విరిగిపోయి నష్టం వాటిల్లుతుంది. మునగ చెట్లు తరచుగా చీడలకు గురవుతున్నాయి. దీంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మునగ దిగుబడి, సస్య రక్షణకు క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పించాలి. నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.


- బత్తిని వీరాస్వామి, మునగ రైతు, మాకనపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



గాలులకు, చీడపీడలకు నష్టపోయిన మునగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ఉత్సాహంతో పంటను పండిస్తాం. అందరం కలిసి కష్టపడి పనిచేస్తేనే ధర గిట్టుబాటు అవుతుంది. కూలీలను పెడితే నష్టం వస్తుంది.

- బొంగు చంద్రావతి, మునగ రైతు, పెద్దనీలావతి



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజల రుణం తీర్చుకుంటా

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ చరిత్రలో గతంలో ఏ శాసనసభ్యుడుకు ఇవ్వని అత్యధిక మెజార్టీ అందించిన ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా ఆదివారం ఆమదాలవలస చేరుకున్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. కోలాటాలు, నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఫ్లై ఓవర్ మీదుగా కృష్టాపురం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ ఈ గెలుపుతో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని, దీనికి ప్రజల సహకారం అవసరమని అన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడుతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీరుకట్ల విశ్వప్రసాద్, బూర్జ జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎ.రామకృష్ణ, శివ్వాల సూర్యనారాయణ, చిగురుపల్లి రామ్మోహన్, తమినేని చంద్రవేఖర్, సనపల ఢిల్లీశ్వరరావు, బొడ్డేపల్లి గౌరీపతి, కిల్లి సిద్ధార్థ, కిల్లి శేషు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : రవికుమార్ అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారి శ్రీకాకుళం చేరుకున్నారు. ఆయనకు నగరంలోని సింహద్వారం వద్ద కూటమి పార్టీల నేతృత్వాన ఘనంగా స్వాగత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గజమాలతో సత్కరించిన అనంతరం ప్రత్యేక టాప్‌లెస్ వాహనంలో నగరంలోకి ప్రవేశించారు. కిమ్స్ రోడ్ మీదుగా డేఅండ్‌నైట్ జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఏడు రోడ్లు, కళింగ రోడ్డు, అరసవల్లి, సూర్యమహల్, రామలక్ష్మణ కూడళ్ల మీదుగా తిరిగి డేఅండ్‌నైట్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపలం, పైడి రాజారావు, సూర శ్రీనివాసరావు, మొదలవలస రమేష్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ దానేటి శ్రీధర్ పాల్గొన్నారు.



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజల గొంతుక 'ప్రజాశక్తి'

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

సామాన్య ప్రజల గొంతుకగా అన్ని వర్గాల ప్రజల్లో విలువలతో కూడిన పత్రికగా 'ప్రజాశక్తి' మెప్పుపొందుతోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. శాసనసభ్యురాలిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి నియోజకవర్గానికి చేరుకున్న ఆమె పలాస మండల పరిషత్ కార్యాలయంలో 'ప్రజాశక్తి' ప్రత్యేక సంచికను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా ప్రజల పక్షాన నిలుస్తున్న పత్రిక అని కొనియాడారు. ప్రజాశక్తిలో వచ్చిన ప్రతివార్త, ప్రతివాక్యం ప్రజల వాక్కుగా నిలుస్తోందన్నారు. ఉద్యమాల చరిత్ర ఉన్న పలాస ప్రాంతంలో అడుగడున ప్రజలు ఇబ్బందులు పడిన ప్రతిసారీ వారికి అండగా నిలుస్తోందన్నారు. రానున్న రోజుల్లో పలాస నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, మల్లా శ్రీనివాస రావు, ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, ప్రజాశక్తి పలాస డిఒ ఉమామహేశ్వరరావు, చంద్రశేఖర్ త్యాడి, వంకల కూర్మారావు, అనిల్‌శర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహాలక్ష్మి

ఉద్యోగ భద్రత కల్పించాలి

మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మహాలక్ష్మి

ప్రజాశక్తి- నందిగాం

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ పథకం సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నందిగాం జిల్లా పరిషత్ ఆవరణలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 23 ఏళ్ల మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులుగా గుర్తించకుండ, కనీస వేతనాలు అమలు చేయకుండా పని చేయించుకోవడం దుర్మార్గమని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల బతుకులు ఎటువంటి మార్పులు లేవన్నారు. మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. వంట చేస్తున్న సమయంలో ప్రమాదం జరిగితే కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు వారికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాదానికి గురైనా, మృతి చెందిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.పది వేలు ఇవ్వాలన్నారు. ప్రతినెలా 5న నాటికి వేతనాలు, బిల్లులు చెల్లించాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్లు వర్తింపజేయాలన్నారు. ఏడాదికి రెండు జతలు యూనిఫారాలు అందజేయాలన్నారు. ఉచితంగా గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించే పద్ధతి ఆపాలన్నారు. మౌలిక సదుపాయాలైన తాగునీరు, వంట షెడ్, వంట పాత్రలు వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. చాలాసార్లు యూనియన్ ఆధ్వర్యాన అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. సమస్యల పరిష్కారానికి దశల వారి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో మండల నాయకులు వి.చిన్నమ్మడు, ఎ.పద్మావతి, కె.మహేశ్వరి, బి.బాలమ్మ, పి.బృందావతి, ఎం.పండా పాల్గొన్నారు.

ఐద్వా నాయకుల పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

తోటి మహిళలలే మంగమ్మపై దౌర్జన్యానికి పాల్పడి అవమానవీయ ఘనటకు పాల్పడడం దారుణమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, నగర కన్వీనర్ శ్రీదేవి పాణిగ్రహి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.లలిత, సూర్యుడమ్మ డిమాండ్ చేశారు. బాధితురాలు మంగమ్మను ఆదివారం పరామర్శించారు. నగరంలోని దమ్ముల వీధికి చెందిన ఆరుగురు మహిళలు నవభారత్ కూడలి వద్ద నివాసముంటున్న దాసరి మంగమ్మ అనే మహిళ ఇంట్లోకి చొరబడి ఆమెను తీవ్రంగా కొట్టి వివస్త్రను చేసి హింసించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇరు గ్రూపులను కూర్చుని సామరస్యపూరిత వాతావరణంలో మాట్లాడి పరిష్కరించుకోవాల్సిన సమస్యను ఆవేశాలకు పోయి నిరాశ్రయురాలిగా ఉందన్న కారణంతో కొందరు మహిళలపై దాడులకు తెగబడటం దారుణమన్నారు. పరారీలో ఉన్న నిందితులు అల్లుబిల్లి రాధతోపాటు ఘటనకు బాధ్యులైన వారిని శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

శివారు ప్రాంతాలకు సాగునీరు

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష


పలాస : పలాస శివారు ప్రాంత రైతులకు ఈ ఏడాది వంశధారు నీరు అందించి తీరుతామని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉంగ ప్రవీణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఇరిగేషన్ శాఖ సమీక్షలో ఎఇ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ వంశధార జంగిల్ క్లియరెన్స్‌కు రూ.పది లక్షలు, మరమ్మతులకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని చెప్పారు. అన్నారు. దీనితో ఎమ్మెల్యే కలుగుజేసుకొని గత నాలుగేళ్లలో వంశధార పనులు ఎందుకు చేపట్టలేదని, శివారు ప్రాంతాలకు ఎందుకు సాగునీరు అందించలేకపో యారని ప్రశ్నించారు. దీనికి ఎఇ సమాధానం చెబుతూ గతంలో పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని వివరించారు. దీనిపై శిరీష మాట్లాడుతూ గత నాలుగేళ్లు ఇరిగేషన్ అధికారులు, గత పాలకులు నిర్లక్ష్యం కారణంగానే శివారు భూములకు అందించలేకపోయారని అన్నారు. ఈ ఏడాది శివారు ప్రాంతాలకు నీరు అందిస్తామని అన్నారు. వ్యవసాయ సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు కోరుకున్న ఎరువులు తెప్పించి కొరత లేకుండా చూస్తామని అన్నారు. చినంచల ఎంపిటిసి బి.దుర్యోధన మాట్లాడుతూ చినంచలలో ఉండే పాఠశాల మూతపడిందని, కొత్తగా పాఠశాల మంజూరు చేయాలని గత ప్రభుత్వంలో కోరామని అన్నారు. ఇప్పుడైనా పాఠశాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎంపిపి ఉంగ్ర ప్రవీణ మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు. సమావేశంలో ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు. వైస్ ఎంపిపిలు తలగాన శ్రీరాములు పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను నాయకులు, అధికారులు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- **గిరిజన ప్రాంతాల్లో కీటక నాశని మందు పిచికారీ**
- **వ్యాధుల లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు తప్పనిసరి**
- **డిఎంహెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి**



డాక్టర్ బి.మీనాక్షి, డిఎంహెచ్ఒ



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వర్షాలు మొదలు కావడంతో రానున్న మూడు నెలల కాల వ్యవధిలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి దోమల నావారణకు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. ఇటీవల కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. గ్రామాల్లోను, పట్టణ ప్రాంతాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా కాలువలను శుభ్రం చేసే ప్రక్రియ మొదలైంది. దీనికి తోడు లార్వా వృద్ధి చెందకుండా దోమల కీటక నాశిని పిచికారీ ప్రారంభించామన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. జిల్లాలో ప్రస్తుత పరిస్థితులపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? మలేరియా నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలడానికి ప్రధానంగా దోమలే కారణం. వాటిని నియంత్రించడం ద్వారా వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు. అందులో భాగంగానే ప్రజల్లో అవగాహన కోసం ఈ నెల 1 నుంచి 30 వరకు మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడతాం. మలేరియా, డెంగీ వ్యాధుల నియంత్రణకు ప్రధానంగా నీటి నిల్వలు ఎక్కడ పడితే అక్కడ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యులు, క్షేత్రస్థాయిలో ఎఎన్ఎం, ఆశావర్కర్లు, అంగన్వాడీలతో కలిసి ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా మురుగునీరు ఉన్నట్టయితే వెంటనే ఫొటోలు అప్‌లోడ్ చేసే ఇతరశాఖల సమన్వయంతో వాటిని తొలగించడానికి వీలుంటుంది.

? కేసుల నమోదు ఎలా ఉంటోంది?

జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో అవగాహన పెరగడం వల్ల పారిశుధ్య నిర్వహణ కొంత మెరుగుపడుతుంది. దీనివల్ల ఏటా మలేరియా, డెంగీ కేసుల నమోదు తగ్గు ముఖం పడుతుంది. 2016 నుంచి మలేరియా, డెంగీ కేసులు తగ్గుతూ వస్తుందని తెలియచేయడం ఆనందంగా ఉందన్నారు. డెంగీ 2021లో 117 కేసులు, 2022లో 89 కేసులు, 2023లో 54 కేసులు నమోదయ్యాయి. 2024లో ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదయ్యాయి. మలేరియా 2021లో 22 కేసులు, 2022లో 9 కేసులు, 2023లో 11 కేసులు, 2024లో ఇప్పటి వరకు రెండు కేసులు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో ప్రజలు అప్రమత్తంగా ఉంటే కేసులు తగ్గే అవకాశం ఉంటుంది.

? మలేరియా వ్యాధిని గుర్తించడం ఎలా?

మలేరియా వ్యాధి సోకిన రోగికి జ్వరం మొదలైన తర్వాత రోజు విడిచి రోజు జ్వరం, వనుకుతో కూడిన జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులు, వాంతులు చెమటలు పట్టుట, తీవ్రమైన కేసుల్లో ఫిట్స్, అపస్మారక స్థితి మలేరియా వ్యాధి లక్షణాలు. వ్యాధి నిర్ధారణకు పరీక్షలు చేయించుకోవాలి. సకాలంలో మందులు వాడడం ద్వారా నయం చేసుకోవచ్చు. మలేరియా వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలి. పడుకునే సమయంలో దోమతెరలు తప్పనిసరిగా వాడాలి. గిరిజన ప్రాంతాల్లో కీటకనాశిని పిచికారీ తప్పనిసరిగా చేయించుకోవాలి. పిల్లలకు చేతులు, కాళ్లకు నిండుగా ఉండే దుస్తులు వేయాలి. సొంత చికిత్స చేయకుండా దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి రక్త పరీక్ష చేయించుకుని వైద్యుల సూచన మేరకు మందులు తప్పనిసరిగా వాడాలి.

? డెంగీ కేసుల నమోదు ఎలా ఉంటోంది?

జిల్లాలో డెంగీ కేసులు ఏటా పెరుగుతున్నాయి. 2023లో డెంగీ 54 కేసులు నమోదైతే. ఈఏడాది ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదయ్యాయి. పొందూరు, రణస్థలం, సింగుపురం, కొర్లాం, శ్రీకాకుళం, హిరమండలం మండలాల్లో ఒక్కో కేసు నమోదయ్యాయి. పగటి పూట సంచరించే దోమల వల్ల డెంగీ సోకే ప్రమాదం ఉంది. ఇంటి చుట్టూ మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలి. వర్షాలు మొదలు కాగానే వీటిని నీటి నిల్వ ప్రాంతాల్లో విడిచి పెట్టడం ద్వారా దోమల నియంత్రణకు వీలువుతుంది. జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యాన చర్యలు తీసుకుంటున్నాం.

? లింగ నిర్ధారణ పరీక్షల అడ్డుకట్టకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టడానికి ఆరు బృందాలను నియమించాం. ఎక్కడైనా ఫిర్యాదు వస్తే వెంటనే తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటున్నాం. నింబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే అటువంటి కేంద్రాలపై చర్యలు తప్పవు. జిల్లాలో విస్తృత స్థాయిలో మూడు డివిజన్ల పరిధిలోని స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నాం. బృందాల్లో జిల్లా ఆర్‌బిఎస్‌కె కో-ఆర్డినేటర్ డాక్టర్ సిపి శ్రీదేవి, డిపిఎంఒ డాక్టర్ జె.వి.లక్ష్మి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, డెప్యూటీ డెమో మహంతి వెంకటేశ్వరరావు, సూర్యకళ, మోహిని బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్కాన్ చేసిన తరువాత 24 గంటల్లో ఫారమ్-ఎఫ్‌ను పిసిపిఎన్‌డిటి వెబ్‌లో అప్లోడ్ చేయాలి. లేకుంటే వారిపై చర్యలు తప్పవు.

? బిసిజి టీకాలు వేసే కార్యక్రమం ఎలా సాగుతోంది?

జిల్లాలో 18 ఏళ్లు దాటిన వారికి బిసిజి టీకాలు వేయనున్నాం. ఎక్కువగా 60 ఏళ్లు దాటిన వారికి టీకా గురించి వివరించి వారి అనుమతితోనే వేశాం. 80 ఏళ్లు దాటిన వారికి అప్పట్లో టీకాలు వేసి ఉండకపోవచ్చు. అవగాహన కూడా తక్కువే. అందుకే 60 ఏళ్లు దాటిన వారికి టీకాలు వేయడానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ టీకా టిబి రాకుండా చేస్తుంది. బిసిజి టీకాలు గర్భిణులు, కేన్సర్ వ్యాధిగ్రస్తులకు వేయకూడదు. అందువల్ల ఈ రెండు రకాల వారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత వైద్య సిబ్బంది పూర్తి సమాచారం తెలుసుకున్న తర్వాత టీకా వేయాల్సి ఉంటుంది.


వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న తారకేశ్వరరావు

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడలతోనే మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని యువత క్రీడలపై ఆసక్తి చూపాలని చీమల తారకేశ్వరరావు అన్నారు. నగరంలోని నాగావళి నది ఒడ్డున ఆదివారం తారకేశ్వరరావు సుమారు రూ.47,500 నిర్మించిన వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల బారిన పడకుండా ప్రతిరోజూ కొంత సమయం ఆటలపై దృష్టి సారించాలని కోరారు. స్థానికంగా ఉంటున్న యువకులు ఆడుకునేందుకు సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని, వారి కోసం ఈ ఆట స్థలాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతిఒక్కరూ క్రీడాస్ఫూర్తిగా మెలిగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంతోష్, సతీష్, భవానీ, బుజ్జి, ప్రసాద్, తరుణ్, సాయి, చిన్ని జగదీష్, జి.సాయి, సాహుకారి శ్రీను, గోపాల్, సుధీర్, కుమార్, సంతోష్‌కుమార్, చిన్న పాల్గొన్నారు.


వీల్‌చైర్లను అందజేస్తున్న శ్రీనివాస్

అరసవల్లికి వీల్‌చైర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి వచ్చే వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం ఆదివారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన మోటమర్రి శ్రీనివాస్ రెండు వీల్‌చైర్లను అందజేశారు. తన తండ్రి జోగారావు జ్ఞాపకార్థం వీటిని కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ఇఒ చంద్రశేఖర్‌కు ఆదివారం అందజేశారు.

రూ.6.05 లక్షల ఆదాయం

ఆదివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రూ.6.05 లక్షల మేర ఆదాయం సమకూరింది. టికెట్లు విక్రయాల ద్వారా రూ.3,08,400, విరాళాల రూపంలో రూ.71,749, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,24,860 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఇఒ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.


బియ్యం ప్యాకెట్‌ను అందజేస్తున్న కూటమి నాయకులు

మృతురాలి కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరుకు చెందిన టిడిపి కార్యకర్త డొకల చంటి నాన్నమ్మ డొకల ఆదిలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం మృతురాలు కుటుంబానికి కూటమి నాయకులు రాజు, నవిరి గండి సురేష్‌లు కలిసి ఆర్థికసాయంతో పాటు బియ్యం బస్తాను ఆమె కుటుంబ సభ్యులకు అందజేసి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో తెండాల పుణ్యవతి, గుడివాడ రాము, ఎస్. సురేష్, శివ, గణేష్, రమేష్, రాజు తదితరులున్నారు.


మొక్కను నాటుతున్న సభ్యులు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

రణస్థలం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని రణస్థలం ఎస్ఇబి, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవిప్రసాద్, రిటైర్డ్ ఎలక్ట్రికల్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఆకెళ్ల సూరిబాబు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీముత్యాలమ్మ తల్లి ఆలయం ఆవరణలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇళ్ళ ఆవరణలో, ఆలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల ఆవరణ, రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు. అలాగే పిల్లల పుట్టినరోజున పిల్లలతో మొక్కలు నాటించి పిల్లలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెంటమాని అప్పారావు, కమిటీ సభ్యులు శనాపతి వరప్రసాదరావు, నెమలిపురి బాలరాజు, భావరాజు, శ్రీధర్ పాల్గొన్నారు.


మంత్రి పార్థసారథిని కలిసిన జోగినాయుడు తదితరులు

జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి

శ్రీకాకుళం అర్బన్: జర్నలిస్టుల గౌరవాన్ని పెంచే విధంగా వారి పిల్లలకు ప్రైవేటు స్కూళ్లల్లో శతశాతం ఫీజు రాయితీ కల్పించి చదువుకునేందుకు తోడ్పాటు అందించాలని జర్నలిస్టుల ఫోరం నాయకులు శాసపు జోగినాయుడు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారథిని కోరారు. ఆదివారం అమరావతిలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఫీజు రాయితీపై జిఒ విడుదల చేశారని, గత ప్రభుత్వ హయాంలో ఆ జిఒను రద్దు చేసి రాయితీ లేకుండా చేశారని వివరించారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల నుంచి ఫీజులు చెల్లించాలని ఒత్తిడి వస్తోందని వివరించారు. పాత జిఒను పునరుద్ధరించి జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేటు విద్యను అందుకునేందుకు తోడ్పాటు అందించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లాకు చెందిన జర్నలిస్టులు కె.రవి, బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కళింగ కోమటి సంఘ అధ్యక్షునిగా 'బోయిన'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర కళింగ కోమటి సంక్షేమ సంఘం అధ్యక్షునిగా బోయిన గోవిందరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని వైశ్య రాజు కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఈఎన్నిక జరిగింది. ఇప్పటివరకు ఈపదవిలో కొనసాగిన కోణార్క్ శ్రీను ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో గోవిందరాజులను సభ్యులు ఎన్నుకున్నారు.

ఆధార్‌కు తప్పని అవస్థలు

- ఆందోళనలో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

ఆధార్ కోసం మండలంలోని విద్యార్థులకు అనునిత్యం అవస్థలు తప్పడం లేదు. ఒకవైపు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు సమయం లేదని చెప్తుంటే మరోవైపు ఇంటర్నెట్ పనిచేయడం లేదు. ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టలేమని చేతులెత్తేస్తున్న ఆధార్ సెంటర్ల సిబ్బంది. మరోవైపు ఏం చేయాలో అర్థం కాని స్థితిలో విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలో ప్రభుత్వానికి సంబంధించి చీడివలస, పాలవలస గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని బూర్జలో ఆధార్ సెంటర్లు ఉన్నాయి. అయితే గత నెల రోజులుగా ఇక్కడ ఆధార్ కార్డుల్లో ఎటువంటి చేర్పులు, మార్పులు జరగడంలేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వర్ డౌన్ అవుతుందని, ఎర్రర్ చూపిస్తుందని ఆధార్ సెంటర్లో సిబ్బంది చెబుతున్నారు. అయితే ఒకవైపు ఆధార్ కార్డుల్లో సవరణలు లేకపోవడంతో పాటు మరోవైపు విద్యార్థులకు కావలసిన క్యాస్ట్, ఇన్‌కమ్ తదితర సర్టిఫికెట్లు జారీ చేయడంలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. దీంతో తాము పాఠశాలలు, కళాశాలల్లో జాయిన్ అయ్యేందుకు అవకాశం లేకుండా పోతుందని వాపోతున్నారు. మరోవైపు ఆయా సెంటర్లకు వెళ్తే మా దగ్గర ఆధార్ కార్డులకు సంబంధించి సిస్టం పనిచేయడం లేదని ఉప్పునివలస గ్రామంలో ఉన్న ప్రైవేట్ ఆధార్ సెంటర్‌కు లేదా ఆమదాలవలసకు వెళ్ళిపోవాలని సిబ్బంది చెబుతున్నారని విద్యార్థులు తెలిపారు. అయితే మండలంలో విద్యార్థులంతా ఒకే సెంటర్‌కు వెళ్లడం వలన అక్కడ రద్దీ కారణంతో రోజుల తరబడి ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుందని విద్యార్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో తమకు కావలసిన ధ్రువ పత్రాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఆధార్ కార్డుల్లో చేర్పులు, మార్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


పాలవలస గ్రామ సచివాలయం

ఇబ్బందులకు గురి చేయొద్దు



ఆధార్ సెంటర్లలో ఎర్రర్ చూపి స్తుంది. హ్యాంగ్ అవుతుంది అంటూ సమాధానాలు చెప్తున్నారు. దీనివలన తాము ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు స్పందించి తక్షణమే విద్యార్థులకు కావాల్సిన ఆధార్ అప్‌డేట్లును చేపట్టాలి.

- చంద్రమౌళి, పి.రామన్నపేట

బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం నూతన కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుల ఫోరం సమావేశం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గౌరవ అధ్యక్షులు కవిటి కుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. జీవశాస్త్ర బోధన ప్రక్రియలు మరింతగా అభివృద్ధి చెందాలన్నారు. విద్యార్థులు బయలాజికల్ సైన్స్‌పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. భవిష్యత్‌లో నీట్, ఇతర పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు సిలబస్ ఉండే విధంగా ప్రభుత్వానికి నివేదించాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. శాస్త్రీయ విజ్ఞానం కోసం ప్రొఫెసర్లు శాస్త్రవేత్తలు విద్యా వేత్తలతో జిల్లాస్థాయిలో సెమినార్లు వర్క్‌షాప్‌లు నిర్వహించేందుకు సమావేశం నిర్ణయించింది. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా ఎన్.కుమార్‌స్వామి, సలహాదారుగా ఎస్.ఉమామహేశ్వరి, గౌరవ అధ్యక్షులు కవిటి కుమార్, అధ్యక్షునిగా పుట్టా ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా గగనకుమారి, ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, సంయుక్త కార్యదర్శి ఎం.కవిత, కోశాధికారి వి.త్రివిక్రమ్‌లు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ప్రమోద్ కుమార్ పాడి, గొంటి గిరిధర్‌లను ఎన్నుకున్నారు. అకడమిక్ కో ఆర్డినేటర్‌గా జి.మోషే, టెక్నికల్ కో-ఆర్డినేటర్ డి.మురళి, లాజిస్టిక్ కో-ఆర్డినేటర్‌గా ఐ.రేవతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి నల్ల కుమారస్వామి, ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న అబ్రహం

ముసలయ్యకు ఆర్థికసాయం

టెక్కలి రూరల్ : మండలంలో చిన్నరోకలపల్లి గ్రామం మిండబోయిన ముసలయ్య భార్య గౌరమ్మ కొంతకాలముగా పక్షవాతంతో మంచానపడి లేవలేని స్థితిలో బాధపడుతుంది. ఈ విషయం తెలుసుకున్న టెక్కలి లివింగ్ స్టోన్ చర్చి సభ్యులు రూ.10,800 ఆర్థికసాయం ఆదివారం ముసలయ్యకు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో పది శాతం కేటాయించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కొత్త ప్రభుత్వం అబ్కారీ విధానంలో మద్యం షాపులు, బార్ కేటాయింపులో 10 శాతం సొండి కులానికి కేటాయించాలని సొండికుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. అమరావతిలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలను సంఘం నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రాలను అందజేశారు. రాష్ట్రంలో సొండి సామాజిక తరగతి సుమారు లక్ష జనాభా కలిగి ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో తీవ్ర వివక్షతకు గురయ్యామని, సారా అమ్మకాలే కుల వృత్తిగా జీవనం సాగించే సొండీలకు ఇప్పుడు జీవనాధారం కరువైందని వివరించారు. కులవృత్తికి ప్రత్యామ్నాయ, ఉపాధి అవకాశాలను కల్పించకపోవడంతో బతుకు భారమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సొండీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వాలని కోరారు. అలాగే బి.సి ఎ జాబితాలో తమ సామాజిక తరగతిని చేర్చాలని కోరారు. జాతీయ స్థాయిలో ఒబిసి కేటగిరిలో చేర్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మంత్రి, ఎమ్మెల్యేలను కలిసిన వారిలో సొండికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి సాహుకారి నాగేశ్వరరావు, కోశాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

వాలంటీర్ల భవితవ్యం ప్రశ్నార్థకం

- వ్యవస్థను కొనసాగిస్తామని ప్రభుత్వం హామీ
- ఖరారు కాని విధివిధానాలు
- అయోమయంలో వాలంటీర్లు

ప్రజాశక్తి- బూర్జ

నియోజకవర్గంలోని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న వాలంటీర్ల భవితవ్యం ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం వాలంటీర్లు ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

గత వైసిపి ప్రభుత్వంలో వాలంటీర్లు అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి మధ్య వారిధిగా ఎన్నో సేవలను అందజేశారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పథకాలు నేరుగా లబ్ధిదారుని ఇంటికి వెళ్లేందుకు వాలంటీర్లను నియమించింది. అయితే ప్రస్తుతం వారి భవితవ్యం అగమ్యగోచరంగా వుంది. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా వాలింటీర్లు రాజీనామా చేయాలని ప్రభుత్వం ఒత్తిడి తేవడంతో ఎన్నికల ముందే రాజీనామా చేశారు. వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని టిడిపి హామీ ఇవ్వడంతో ప్రభుత్వం అడుగులు ఎలా ఉండబోతుందా అన్న దానిపై గందరగోళం నెలకొంది. టిడిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటికీ ఇంతవరకు వాలంటీర్ల వ్యవస్థకు సంబంధించి ఇంకా విధి విధానాలను ప్రభుత్వం ఖరారు చేయకపోవడంతో వాలంటీర్లలో అయోమయం నెలకొంది. ఎన్నికల్లో వైసిపి ఓటమి చెందడంతో గ్రామ వాలంటీర్ల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు విధుల నుంచి తాత్కాలికంగా తప్పుకోవాలని షరతు విధించడంతో వాలంటీర్లను వైసిపి ప్రభుత్వం నియమించింది కాబట్టి వారు చెప్పిందే తడువుగా రాజీనామాలకు సిద్ధమయ్యామని పలువురు వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో రాజీనామా చేయని వాలంటీర్లు సైతం ప్రస్తుతం భవిష్యత్‌పై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వాలంటీర్లను నియమిస్తే తమకు అవకాశం వస్తుందో రాదోనని అనుక్షణం టెన్షన్‌తో ఉన్నారు. టిడిపి ప్రభుత్వం తమను తిరిగి నియమిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. నూతన ప్రభుత్వం వాలంటీర్లకు డిగ్రీ అర్హత ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా వీరికి రూ.10వేలు జీతం కూడా ఇవ్వనున్నట్లు సమాచారం. ఏదిఏమైనా ప్రభుత్వం వాలంటీర్ల నియామకానికి విధివిధానాలను ఖరారు చేసేంతవరకు వేచి చూడాల్సిందే.

పింఛన్ల పంపిణీపై సందిగ్ధం

ఒకవైపు వాలంటీర్ల నియామకం మరొకవైపు జూలై 1న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీపై సందిగ్ధం నెలకొంది. లబ్ధిదారుల బ్యాంకుఖాతాలో వేస్తారని కొంతమంది చెబుతుండగా వాలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తారని మరి కొంతమంది చెప్తున్నారు. అయితే అధికారులు మాత్రం ఇంతవరకు ఉత్తర్వులు రాలేదని తెలిపారు.

వాలంటీర్లుగా నియమించాలి



వాలంటీర్లుగా ఎన్నో సేవలను అందజేశాం. చాలీచాలని జీతంతో పనిచేశాం. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజీనామా చేశాం. తిరిగి తమను వాలంటీర్లుగా నియమించాలి.

- శ్రీనివాసరావు, వాలంటీర్, అల్లెన

జిఒ 117ను రద్దు చేయాలి


మాట్లాడుతున్న అనంతాచార్యులు

ఇచ్ఛాపురం : గత ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 117ను తక్షణమే రద్దు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.వి.అనంతాచార్యులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలశాఖ అధ్యక్షులు శంకర్ అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3, 4, 5 తరగతుల విలీనం ఉపసంహరించాలన్నారు. తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. జిల్లాలో అతి పెద్ద ఉన్నత పాఠశాల అయిన ఇచ్ఛాపురంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండదని, డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని కోరారు. ఈ పాఠశాలలో 1,390 విద్యార్థులకు 32 మంది ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. అన్ని ఉన్నత పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ఆర్థిక అవసరాల దృష్ట్యా సిపిఎస్ ఖాతా నుంచి నగదు ఉపసంహరణకు అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి జి.ఉమాశంకర, ఎం.సూర్యం, ఎస్.రాజు, తులసీరావు, ఎస్.రాజు, రవీంద్రబాబు పాల్గొన్నారు.

పాఠాల బోధనలో గందరగోళం

ప్రజాశక్తి- టెక్కలి

ఈ ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలో ప్రారంభమైన పాఠశాలల్లోకి వచ్చిన విద్యార్థులకు ఏ మీడియంలో బోధన చేయాలా? అన్నది ఉపాధ్యాయుల్లో గందరగోళ పరిస్థితి నెలకుంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో అప్పట్లో అధికారం చేపట్టిన టిడిపి ప్రభుత్వ హయాంలో సక్సెస్ పాఠశాలలు అనే పేరుతో మండలాల్లో ఎంపిక చేశారు. ఆయా పాఠశాలలకే ఆంగ్ల మాధ్యమం బోధన పరిమితమైంది. మిగిలిన పాఠశాలల్లో తెలుగు మీడియంలో బోధించేవారు. తర్వాత అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆంగ్ల మాధ్యమంలో బోధించారు. కానీ, అందులోని సాంకేతిక లోపాలను అధిగమించలేదు. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం బోధన తప్పనిసరి చేస్తూ... ఎటువంటి ప్రభుత్వ ఆదేశాలు జారీ చేయలేదు. పాఠ్యపుస్తకాల్లో మాత్రం రెండు మీడియంల్లో ముద్రణ చేసి పంపిణీ చేశారు. దీంతో

మీడియంపై సందిగ్ధత

ఏదోవిధంగా బోధన చేసినా ఈ ఏడాది పదో తరగతి వచ్చేసరికి గందరగోళ పరిస్థితి నెలకుంది. ఎందుకంటే ప్రస్తుత పదో తరగతి విద్యార్థులకు గతంలో తెలుగు మాధ్యమంలో మాత్రమే బోధించారు. ఏడాది విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు మారాయి. మారిన పుస్తకాల ప్రకారం ఆంగ్ల మాధ్యమంలో బోధన కష్టతరంగా మారనుందని ఉపాధ్యాయులు అంటున్నారు. ఒక్క సాంఘీకశాస్త్రం పాఠ్య పుస్తకానికే నాలుగు బోధించాల్సి ఉందని వారో వాపోతున్నారు. అదేవిధంగా మిగిలిన పాఠ్యపుస్తకాల్లో సిలబస్ కూడా విద్యార్థులస్థాయి కన్న అధికంగా ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు. కాగా, ప్రస్తుతం దో తరగతికి వచ్చే విద్యార్థులు మాత్రం గతేడాది వరకు తెలుగు మాధ్యమంలో మాత్రమే బోధించేవారు. ఇప్పుడు మారిన పాఠ్యపుస్తకాల మేరకు ఆంగ్ల మాధ్యమంలో బోధించాలా? తెలుగు మాధ్యమంలో బోధించాలా? అన్నది సందేహంగా ఉంది. సిలబస్ బోధన, విద్యార్థులకు ఏ మీడియంలో బోధించాలనే విషయమై విద్యాశాఖ నుంచి ఎటువంటి స్పష్టమైన ఆదేశాలు వెలువడలేదు. మీడియం బోధన గందరగోళ పరిస్థితిలో ఉంది. పాఠశాలలు తెరిచి పది రోజులు పూర్తయిన నేపథ్యంలో పాఠ్యపుస్తకాలు సరఫరా కూడా జరిగాయి. సిలబస్ ప్రకారం బోధన చేయడంలో సమయం మించిపోతుండడంతో ఉపాధ్యాయుల్లో గందరగోళ నెలకుంది. కాగా, కేంద్ర ప్రభుత్వం మాత్రం మాతృ భాషలోనే విద్యా బోధన ఉండాలని చెబుతుంది. ఈ తరుణంలో ఆంధ్రాలో తెలుగు మాధ్యమంలో బోధన చేయాలా? వద్దా? అనే సందేహాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రస్తుతం బోధన జరుగుతున్న ఆంగ్ల మాధ్యమంలో సిలబస్ కూడా విద్యార్థిస్థాయి కన్న ఎక్కువగా ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు. పాఠ్యాంశాలు బోధనపై విద్యాశాఖ తీసుకునే నిర్ణయం త్వరితగతిన ఉండాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గౌరీశంకర్‌కు పురస్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

విశాఖపట్నం జిల్లా అగనంపూడి కంచిపూడి గురుమూర్తి స్మారక రాష్ట్రస్థాయి కథ, కవితల పోటీల్లో గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల తెలుగు విభాగాధిపతి భమిడిపాటి గౌరిశంకర్ రచించిన కథకు పురష్కారం లభించింది. ఈ సందర్బంగా నిర్వాహకులు, సినీనటుడు, దర్శక, నిర్మాత ప్రసన్న కుమార్ చేతులమీదుగా గౌరీశంకర్‌కు నగదు, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్బంగా అయనను విద్యాసంస్థల అధినేత జి.వి. స్వామినాయుడు, ప్రిన్సిపాల్ డా.పులఖండం శ్రీనివాసరావు, అధ్యాపక బృందం అభినందించారు.


చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

ఘనంగా నివాళి

ఇచ్ఛాపురం : డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్బంగా స్థానిక వికెపి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చ అధ్యక్షులు మంగి లక్ష్మి, వి.కె.ప్రసాద్, భగవాన్, రాంప్రసాద్, శంకరన్నారాయణ, రమేష్, వడ్డీన జోగారావు, లొడ్డపుట్టి కేశవ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నందిగాం : గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల ఖాళీల భర్తీకి ఈ నెల 26లోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.దమయంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ప్రవేశ పరీక్ష ఉంటుందని అన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.


అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ లలితా ఛారిటబుల్ ట్రస్టులో వజ్రపుకొత్తూరు మండలం జనసేన టీమ్ సభ్యులు జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పదవి చేపట్టిన సందర్భంగా ఆదివారం వృద్ధులకు, అనాథలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు అట్టాడ వాసు మాట్లాడుతూ సుధీర్ఘంగా 11 ఏళ్ల రాష్ట్ర ప్రజల కోసం నిస్వార్థంగా పవన్ ఎన్నో సేవలు అందించారని అన్నారు. పదవిని బాధ్యతగా భావిస్తూ... మరెంతా ఉత్సాహంతో పనిచేసి పేదలకు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జనసేన టీమ్ నాయకులు తేజ, దేవ, రాజు, గీత, గణపతి, ఈశ్వర్, పూర్ణ, నాగరాజు, కార్తిక్, లలితా ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధి చిన్నికృష్ణ పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తాతయ్యకు సన్మానం

టెక్కలి : మండలంలోని భీంపురం ఆశ్రమ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా మూల తాతయ్య విధులు నిర్వర్తించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఉపాధ్యాయునిగా, నటునిగా, కళాకారునిగా, రచయితగా తాతయ్య చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులకు పాఠ్యబోధనలో తాతయ్య చూపిన చొరవని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య కళా సమితి నిర్వాహకులు చిలుకు కృష్ణారావు, ఉత్తరక వాటం గణపతిరావు, ఇంటర్మీడియట్ బోర్డ్ డిఐఇఒ కోట ప్రకాశరావు, మెళియాపుట్టి ఎంఇఒలు సవర దేవేంద్రరావు, మల్లారెడ్డి పద్మనాభం, డిటిఎఫ్ రాష్ట్ర నాయకులు కోత ధర్మారావు, వైద్యులు కణితి కేశవరావు, మల్లేశ్వరరావు, ఆశ్రమ పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ భాస్కరరావు, వల్లభ మల్లయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు రోణంకి రామచంద్రరావు పాల్గొన్నారు.


విత్తనాలను పంపిణీ చేస్తున్న హేమబాబు చౌదరి

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రైతు పక్షపాత టిడిపి ప్రభుత్వమని పిఎసిఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ హేమబాబు చౌదరి అన్నారు. మండలంలోని చినవంక పంచాయతీ పరిధిలోని గుల్లలపాడు రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రతి చేనుకూ నీరు, ప్రతి చేతికి పని నినాదంతో గత ఎన్నికల్లో భారీ విజయం సాధించారని అన్నారు. అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేస్తుండగానే వంశధార కాలువలో పూడికతీత పనులు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో మదనాల సింహచలం, భాస్కరరావు చౌదరి, బగాది రాజారావు, మదనాల నాగేష్, కొంచాడ ప్రసాద్, మురళి, గుల్లలపాడు యూత్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి

పలాస నియోజకవర్గం ఎమ్మెల్యే

శ్రీమతి గౌతు శిరీష విజయోత్సవ

ప్రత్యేక అనుబంధం

Advt. Feature

సోమవారం 24-6-2024 | శ్రీకాకుళం జిల్లా | 4 పేజీలు



సేవ్.. సేఫ్ పలాస



- నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక దృష్టి
- భూ కబ్జాలపై ఉక్కుపాదం
- ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పూర్తికి కృషి
- ప్రతి ఎకరాకూ సాగునీరు
- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

వైసిపి ప్రభుత్వ పాలనలో భూకబ్జాలు, దురాక్రమణలు, దౌర్జన్యాలు, దాడులతో పలాస స్వరూపమే మారిపోయిందని, వాటిని సమూలంగా అరికట్టి సేవ్ పలాస, సేఫ్ పలాసగా తీర్చిదిద్దడమే తన ముందున్న తక్షణ కర్తవ్యమని పలాస నియోజకవర్గ శాసనసభ్యులు గౌతు శిరీష తెలిపారు. ప్రతి ఎకరాకూ సాగునీరు... ప్రతి మనిషికీ పని అనే నినాదంతో పాలన కొనసాగిస్తానని చెప్పారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఎకరాకూ సాగునీరందించడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. శాసనసభ సభ్యురాలిగా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా జిల్లాకు వచ్చిన ఆమెతో 'ప్రజాశక్తి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

మిగతా 2లో

'సర్దార్' ఆశయాలకు వారసురాలు



ప్రజాశక్తి - పలాస

సర్దార్ గౌతు లచ్చన్న... ఈ పేరుకు పరిచయం అవసరం లేదు. దేశంలోనే సర్దార్ అని పిలుపుచుకునే వారిలో ఒకరు సర్దార్ వల్లబాయ్ పటేల్ అయితే, మరొకరు సర్దార్ గౌతు లచ్చన్న. బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన చేసిన పోరాటాలకు ప్రజానీకం ఆయనకు సర్దార్ బిరుదుతో గౌరవించుకుంది. సుదీర్ఘకాలం పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థానం సంపాదించుకున్న ఆచార్య ఎన్.జి రంగా అనుయాయునిగా ఆయన వెన్నంటే నడిచారు. ఎన్నో రైతాంగ ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఐదు పర్యాయాలు శాసనసభ్యునిగా, ఒకసారి లోకసభ సభ్యునిగా, శాసనసభ సభ్యునిగా రెండింటికీ ఎన్నికయ్యారు. ఆ సమయంలో లోకసభ స్థానాన్ని వదులుకుని, ఆయన గురుతుల్యులు గుంటూరు జిల్లాకు చెందిన ఆచార్య ఎన్.జి. రంగాను పోటీ చేయించి గెలిపించుకున్నారు. ఆయన ఎమ్మెల్యేగా కొనసాగారు. రాజకీయాలను శాసించడమే కాదు, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుని యావత్ తెలుగు జాతికి గర్వకారణంగా నిలిచారు.

ఆయన తనయుడు గౌతు శ్యామసుందర శివాజీ కూడా రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, విభజన ఆంధ్రప్రదేశ్‌లో మూడు దశాబ్దాలకు పైగా శాసనసభ్యునిగా కొనసాగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకసారిగా మంత్రిగా కూడా పనిచేశారు. సోంపేట, పలాస నియోజకవర్గాల ఆరుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికయ్యారంటే ప్రజాభిమానం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అందరితో సఖ్యతగా ఉండడమే కాదు, తప్పు ఉందంటే ముఖం మీదే చెప్పే ముక్కుసూటి మనస్తత్వం. తెలుగుదేశం పార్టీపై ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా సమాధానాలు ఇవ్వడం ఆయనకే చెల్లింది. తోటి నేతలను గౌరవిస్తూ, గౌరవం పొందుతూ ముందుకెళ్లిన నాయకుడు శివాజీ. ఆయనపై ఏదైనా విమర్శ చేయాలంటే ప్రతిపక్ష నాయకులు కూడా వెనుకంజ వేసేవారు. అంత నిజాయతీ, నిబద్ధతతో రాజకీయాలు చేశారు. ఆయన హయాంలో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, రైతుల పక్షాన నిలిచి తండ్రి బాటలోనే పయనించారు. సమస్య ఉంటే అది ప్రతిపక్షమైనా.. స్వపక్షమైనా తన వాణిని వినిపించడం శివాజీ ప్రత్యేకత.

మూర్తీభవించిన తెలుగుతనం... మాటల్లో నిక్కచ్చితత్వం... విమర్శల్లో పదును... తాత, తండ్రుల వారసత్వ, రాజకీయ లక్షణాలను పుణికిపుచ్చుకున్న శివంగి గౌతు శిరీష. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రజా గొంతుక వినిపించి, ఇప్పుడు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రజా గళాన్ని వినిపించనున్నారు. వాడిగా, వేడిగా, సూటిగా ఆమె సంధించే ప్రశ్నాస్త్రాలు ప్రత్యర్థులను నిరుత్తరులను చేశాయి. ఆవేదన, ఆక్రోశం కలగలిపిన ఆమె స్వరం ప్రత్యర్థుల గుండెల్లో



గర్జనలా మార్మోగింది. తెలుగుజాతి గర్వించదగిన మహా నాయకుల్లో ఒకరైన సర్దార్ గౌతు లచ్చన్న మనుమరాలిగా, మూడు దశాబ్దాలపాటు శాసనసభలో గళం వినిపించిన గౌతు శ్యామసుందర శివాజీ కుమార్తెగా శిరీష వారి అడుగుజాడల్లో నడుస్తూ అట్టడుగు, అణగారిన వర్గాలకు బాసటగా నిలుస్తున్నారు. ఏ విషయం పైన అయినా కూలంకషంగా అధ్యయనం చేసి స్పష్టంగా, సూటిగా సమాధానం చెప్పడం శిరీష ప్రత్యేకత. తాత గారి పేరిట గ్లో స్వచ్ఛంద సేవా సంస్థను నడుపుతూ ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తున్నారు. పేదలకు ఉచిత వైద్య సేవలందిస్తున్నారు. ఆపత్కాలంలో ప్రజలకు అవసరమయ్యే అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి ఎన్నో ప్రాణాలను నిలిపిన మంచి మనస్కురాలైన శిరీష ఎమ్మెల్యేగా తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టి, ప్రమాణ స్వీకారం చేశారు.

ఆమె బాధలను ఓర్చుకున్నారు. కష్టాలను దిగమింగారు. ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకున్నారు. దుష్ప్రచారం, వ్యక్తిగత దూషణలు, సామాజిక మాధ్యమాల్లో రచ్చ, కార్యకర్తలపై వేధింపులను పంటి బిగువున బిగించారు. ఎక్కడా సంయమనం కోల్పోలేదు. అవసరమైనప్పుడు మాత్రం శివంగిలా విరుచుకుపడ్డారు. 'కాళ్లు విరిచేస్తానంటూ..' బలమైన హెచ్చరికలు జారీ చేశారు. రెండున్నరేళ్ల పాటు.. పెద్ద యుద్ధమే చేశారు. ప్రజానాడి పట్టడంలో ప్రారంభంలో విఫలమైనా.. క్రమేపీ వారి మనసులు దోచుకోవడంలో సఫలీకృతులయ్యారు. ఒకవైపు యుద్ధం చేస్తూనే మరోవైపు.. తన అమ్ములపొదిలోని అస్త్రాలకు పదునుపెట్టారు. ప్రజా సమస్యలపై పోరాటం ప్రారంభించారు. పలాస నియోజకవర్గంలోని మూడు మండలాలు, మున్సిపాలిటీపై గట్టి పట్టు సాధించారు. ఒకరకంగా చెప్పాలంటే.. గొప్ప రాజకీయ వ్యూహ చతురతను ప్రదర్శించారు. చాపకింద నీరులా చుట్టేశారు. తండ్రి గౌతు శివాజీ సూచనలు సలహాలు పాటిస్తూ.. ముందుకు సాగారు. శత్రువును కూడా పలకరిస్తూ అందిరినీ కలుపుకుంటూ.. వారి మనసులు గెలుచుకున్నారు. మరో వైపు భర్త వెంకన్న చౌదరి.. అద్భుతమైన వ్యూహ రచన చేశారు. తెర వెనుక పావులు కదుపుతూ వైసిపి అసంతృప్తులపై దృష్టిసారించారు. కొందరిని బహిరంగంగా పార్టీలో చేర్చుకోగా.. మరి కొందరు.. అటువైపు ఉంటూనే ఇటు సహకరించేలా పావులు కదిపారు. దీంతో ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచీ పలాసలో ఓ రకమైన మార్పు ప్రారంభమైంది. నెమ్మది నెమ్మదిగా శిరీష గెలుపు తీరాల వైపు బాటలు వేశారు. గతంలో చేసిన పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ బలమైన సామాజిక తరగతులను, గట్టి పట్టున్న నేతలను అక్కున చేర్చుకున్నారు. మరోవైపు తెలుగుదేశం



కార్యకర్తలకు అండగా ఉండి.. నేనున్నానన్న భరోసా ఇవ్వటంతో వారంతా కసిగా పనిచేశారు. వైసిపికి గట్టి పట్టున్న మందస లాంటి మండలంలో టిడిపికి ఊహించని మెజారిటీ వచ్చిందంటే వారెంతలా కష్టపడ్డారో ఇట్టే చెప్పవచ్చు. దీంతో అద్భుతమైన విజయం సొంతమైంది. కనీవినీ ఎరుగనంత మెజారిటీ వచ్చింది. ఆమె సైతం సంభ్రమాశ్చర్యానికి గురయ్యేంతలా పలాస ప్రజలు ఓటుతో తమ తీర్పునిచ్చారు. తమ సమస్యలు ఆమె మాత్రమే తీర్చుతుందన్న ప్రగాఢ విశ్వాసంతో ఆమెను అసెంబ్లీలోకి అడుగు పెట్టించారు. ప్రజల నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా గెలిచిన మొదలు వారి సమస్యలపైనే దృష్టిసారించారు. ప్రమాణ స్వీకారం జరుగుతున్నప్పుడే పలాస నియోజకవర్గంలో సాగునీటిని అందించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహకారంతో వంశధార ఎడమ కాలువలో పూడికతీత పనులనూ ప్రారంభించారు. మున్సిపాల్టీ పాలనను గాడిలో పెట్టించేందుకు శ్రీకారం చుట్టారు.

సేవ్, సేఫ్ పలాస

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వ పాలనలో భూకబ్జాలు, దురాక్రమణలు, దౌర్జన్యాలు, దాడులతో పలాస స్వరూపమే మారిపోయిందని, వాటిని సమూలంగా అరికట్టి సేవ్ పలాస, సేఫ్ పలాసగా తీర్చిదిద్దడమే తన ముందున్న తక్షణ కర్తవ్యమని పలాస నియోజకవర్గ శాసనసభ్యులు గౌతు శిరీష తెలిపారు. ప్రతి ఎకరాకూ సాగునీరు... ప్రతి మనిషికీ పని అనే నినాదంతో పాలన కొనసాగిస్తానని చెప్పారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఎకరాకూ సాగునీరందించడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. శాసనసభ సభ్యురాలిగా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా జిల్లాకు వచ్చిన ఆమెతో 'ప్రజాశక్తి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

ఆఫ్‌షోర్ రిజర్వాయరు ఎప్పటిలోగా పూర్తి చేస్తారు?

కీర్తిశేషులు వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం, మెళియాపుట్టి మండలాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయరుకు శంకుస్థాపన చేశారు. కానీ, టిడిపి ప్రభుత్వంలో ఎక్కువ శాతం పనులు జరిగియి. తన తండ్రి మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర శివాజీ ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్మాణం కోసం గడ దీక్ష చేపట్టి సుమారు రూ.450 కోట్లు అంచనా విలువను పెంచి పనులు చేపట్టాం. మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో ఒక్క శాతం కూడా పనులు జరగలేదన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్య, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. వాటిని దృష్టిలో పెట్టుకొని ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తి చేసేందుకు ప్రభుత్వం సహకారంతో 2027 ఏడాది చివరి నాటికి పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తాం.

జంట పట్టణాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని తన దృష్టికి వచ్చింది. కానీ, గతంలో పాలక వర్గాలు తాగునీటి ఎద్దడిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు? ఎంతెంత నిధులు వెచ్చించారు? ముందుగా తెలుసుంటా. గతంలో మున్సిపాలిటీ అభివృద్ధి చేసిన పెద్దలు సలహాలను తీసుంటా. మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటా. మరోవైపు మున్సిపల్‌శాఖ మంత్రితో చర్చించి నిధులు మంజూరు చేయించుకుని మున్సిపాలిటీ అభివృద్ధి కృషి చేస్తా. మూడు నెలల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటా.

శివారు భూములకు సాగునీరు అందిస్తారా?

తన తండ్రి మాజీ మంత్రి గౌతు శివాజీ హయాంలో వంశధార అధికారుల సహాయంతో ఐదేళ్లు శివారు భూములకు సాగునీరు అందించారు. వైసిపి హయాంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఐదేళ్లలో ఒక్క చుక్క వంశధార అందించలేకపోయారు. కానీ, జిల్లా మంత్రి, జిల్లా నాయకులు, అధికారులు సహకారంతో నూటికి నూరు శాతం శివారు భూములకు సాగునీరు అందిస్తామని చెప్పాను.

సోషల్ మీడియాలో తప్పడు ప్రచారాలను అరికడతారా?

సోషల్ మీడియాని నీచంగా ఉపయోగించుకున్న పార్టీ వైసిపి. మహిళలను కించపరిచడానికి, వ్యక్తి గత దూషణలకు వాడుకుంది వైసిపి. ముఖ్యంగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తన అనుచరులతో తనపై, తన కుటుంబం పై, తన కులాంతర వివాహంపై అగౌరవంగా, అసభ్యంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. అంతేకాకుండా స్వతంత్ర సమరయోధులైన తన తాత సర్దార్ గౌతు లచ్చన్న చరిత్ర కూడా చెరిపివేయడానికి ప్రయత్నించారు. ఏ పార్టీ అయినా సోషల్ మీడియాలో రాజకీయ విమర్శలు ఎవరైనా ఆహ్వానిస్తాం. అంతేకాని అబద్ధపు వ్యక్తిగత విమర్శలతో మానసికంగా ఇబ్బంది పెట్టడాన్ని పూర్తిగా ఖండిస్తా.

ఇరిగేషన్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తారా?

వైసిపి ప్రభుత్వంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఒక్క పైసా ఖర్చు పెట్టలేదు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, మరమ్మతులు చేపట్టేందుకు మాజీ మంత్రి అప్పలరాజు పూర్తిగా చొరవ చూపలేదు. తాను ఇరిగేషన్ ప్రాజెక్టులపై దృష్టి సారిస్తాను. పలాస మండలం లొత్తూరు మినీ రిజర్వాయరు, మందస మండలం కళింగ దళ్, డబార్ సింగ్, దామోదరసాగర్ తదితర ఇరిగేషన్ ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టి పంట భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపడతాను. వీటి ద్వారా మరో 15 ఏళ్ల వరకు సాగు నీరు కోసం రైతులు ఇబ్బంది పడనవసరం ఉండదు.

రైతుబజార్ ఏర్పాటు చేస్తారా?

తన తండ్రి మాజీ మంత్రి గౌతు శివాజీ పలాసలో రైతుబజార్ ఏర్పాటుకు కృషి చేశారు. అందుకు సంబంధించిన స్థలాన్ని కూడా సేకరించారు. అయితే స్థల వివాదం కారణంగా రైతుబజార్ నిర్మాణం చేపట్టలేకపోయారు. నాలుగేళ్లుగా మంత్రి పదవిలో ఉన్న అప్పలరాజు తాత్కాలిక రైతుబజార్ ఏర్పాటు చేసి మూడు రోజులకే మూత పడింది. కానీ, తన హయాంలో రైతుబజార్ ఏర్పాటుకు తీవ్రంగా కృషి చేస్తాను. తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో రైతుబజార్ ఉందని, ప్రజలు రైతుబజార్ నిర్మాణం చేపట్టాలని అడగక ముందే రైతుబజార్ ఏర్పాటుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తాను. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో పలాస నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతాను.

కాశీబుగ్గ రైల్వే వంతెన సంగతి ఏమిటి?

కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి గత ప్రభుత్వాలు పట్టించుకోకపోతే గౌతు శివాజీ రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణానికి కేటాయించి నిధుల కన్నా అదనంగా నిధులు కేటాయించి పనులు చేపట్టారు. తర్వాత అధికారంలోకి వచ్చిన అప్పలరాజు రెండోసారి శంకుస్థాపన చేసి ఫ్లైఓవర్ పూర్తి చేస్తామని చెప్పి చేతులు ఎత్తేశారు. ఇప్పటి వరకు ఎంతశాతం పనులు చేపట్టారు, ఇంకా ఎంత శాతం పనులు చేయాల్సి ఉంది విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకుని తాను ఏం చేయాలో, ఎలా ముందుకెళ్లాలో ప్రణాళికను సిద్ధం చేసుకుని పట్టుదలతో త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాను.

కిడ్నీ ఆస్పత్రిలో పరిశోధన జరగడం లేదు. పరిశోధన జరిగేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటారు..?

పలాసలో మాజీ మంత్రి అప్పలరాజు నిర్మాణం చేపట్టిన కిడ్నీ ఆస్పత్రిలో డయాలసిస్ మాత్రమే జరుగుతున్నాయి. కానీ, ఉద్దాన ప్రజలు ఏదైతే కిడ్నీ జబ్బులు మూలాలపై పరిశోధనలు కోరుకుంటున్నారో ఆ పరిశోధన దిశగా పనులు జరగడంలేదు. చంద్రబాబు నాయుడు సహకారంతో ఉద్దానం కిడ్నీ, పరిశోధనపై ప్రత్యేక దృష్టి పెట్టేలా చర్యలు తీసుకుంటూ పరిశోధన కేంద్రాన్ని దానికి తగ్గట్టు నెఫ్రాలజీ టీంను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

భూకబ్జాదారులపై మీ వైఖరి ఏమిటి?

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో వైసిపి ప్రభుత్వంలో గత ఐదేళ్ల కాలంలో భూకబ్జాలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వ భూములతో పాటు ప్రయివేట్ వ్యక్తుల భూములను సైతం ఆక్రమించుకున్నారు. ప్రభుత్వ భూముల అక్రమాలను తొలగించేందుకు చర్యలు చేపడతాం. ఇప్పటికే పలాసలో జరుగుతున్న భూ కబ్జాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశా. అప్పటి టెక్కలి సబ్ కలెక్టర్ దృష్టికి దృష్టికి తీసుకెళ్లా. వైసిపి నాయకులు ఆయనను ఆయన్ని బదిలీ చేయడంతో మరలా పలాసలో భూకబ్జాలు పెరిగిపోయాయి. భూ కబ్జాలు తొలగించేందుకు ఇప్పటికే పలాస ఆర్‌డిఒ భరత నాయక్ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఎవరైనా ప్రయివేట్ వ్యక్తులు తమ భూములు ఆక్రమించుకున్నారని నేరుగా ఫిర్యాదు చేస్తే కేవలం 15 రోజుల్లో ఆ భూములపై దర్యాప్తు చేయించి శాశ్వత కాలం ఎటువంటి ఇబ్బందులు లేకుండా భూమి అప్పగిస్తాం.

శ్రీమతి గౌతు శిరీష విజయోత్సవ ప్రత్యేక అనుబంధం
ప్రజాశక్తి

గౌతు శిరీష దృశ్యమాలిక

























గౌతు శిరీష బయోడేటా

పేరు : గౌతు శిరీష

పుట్టిన తేదీ : 1980

విద్యార్హత : ఎంబిఎ (మార్కెటింగ్)

తల్లిదండ్రులు : గౌతు విజయలక్ష్మి (మాజీ ఎంపిపి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు). శ్యామసుందర శివాజీ (మాజీ మంత్రి)

స్వస్థలం : శాసనాం, పలాస మండలం

భర్త : యార్లగడ్డ వెంకన్న చౌదరి (పారిశ్రామికవేత్త, సంఘ సేవకులు)

కుమారుడు, కుమార్తె : శ్రావణ్ శ్రీహర్ష కావ్యసాయి

రాజకీయ నేపథ్యం : తెలుగుదేశం పార్టీ నాయకులుగా 2014 నుంచి క్రియాశీల రాజకీయాలు. 2014లో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లాలో పలాసను రెండో స్థానంలో నిలిపారు. 2015 నుంచి 2019 వరకు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు. 2019లో పలాస నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి వైసిపి అభ్యర్థి సీదిరి అప్పలరాజు చేతిలో ఓటమిపాలయ్యారు. 2019 నుంచి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2024 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా వైసిపి అభ్యర్థి సీదిరి అప్పలరాజుపై విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

సామాజిక సేవ : గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ (గ్లో) అధ్యక్షులుగా తాగునీటి ప్లాంట్లు, గ్రామీణా క్రీడల అభివృద్ధి, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వడం, స్కూళ్లకు బెంచీలు ఏర్పాటు చేయించారు. అధినేత్రి, శిరీష పెట్రోలియం (పెట్రోల్ బంకు) డైరెక్టర్, సర్దార్ ప్రాజెక్టు ప్రై. లిమిటెడ్ (నిర్మాణ రంగం) సామాజిక సేవ, పుస్తక పఠనం.

ఈమెయిల్ :
sireeshavc@gmail.com